క్లుప్తంగా

భారీ వర్షం



పుల్లగుమ్మి గ్రామంలోని వీధుల్లో ప్రవహిస్తున్న వర్షపు నీరు

వెల్దుర్తి: మండల వ్యాప్తంగా శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. పట్టణంలో కురిసిన వర్షంతో కాలువలు పొంగాయి. రామళ్లకోట గ్రామంలో ప్రధాన వీధులు జలమయమయ్యాయి.పుల్లగుమ్మి గ్రామంలో కాల్వలు పొంగి ప్రవహించాయి. వరద నీరు వీధుల్లో చేరి ఇళ్లను ముంచెత్తాయి. చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.పలు గ్రామాల్లోని కుంటలకు వర్షపునీరు చేరింది.

ఫౌంటైన్ కాదు!



రామదుర్గం దగ్గర పైప్ లైన్ నుంచి లీకవుతున్న నీరు

చిప్పగిరి: మండలంలోని పలు గ్రామాలు తాగునీటికి ఇక్కట్లు పడుతుంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగా రామదుర్గం సమీపంలో పైప్ లైన్ లీకేజీ కావడంతో నీరు వృథా అవుతోంది. హాలహర్వి మండలం చింతకుంట జలాశయం నుంచి రామదుర్గం పంప్ హౌస్‌కు చేరిన నీరు పైప్‌లైన్ గుండా నగరడోణ,బెల్డోణ గ్రామాలకు చేరాలి. గ్రామానికి రాక ముందే ఇలా లీకేజీ కావడంతో సరిపడా నీరు సక్రమంగా చేరడం లేదని అయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి లీకేజీని అరికట్టాలని వారు కోరుతున్నారు.

ఘనంగా ఆశా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది

దేవనకొండ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ఆశా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఆశా వర్కర్లతో కలిసి వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, హనుమంతమ్మ, సాయిబాబా, రంగస్వామి, శ్రీధర్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.


ఆలయంలో చోరీ



హుండీని పగలగొట్టిన దృశ్యం

హొళగుంద: మండలకేంద్రం శివారులోని కోగిలతోట రోడ్డులో వెలిసిన వరబసవేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తలుపుల తాళలను పగలగొట్టి లోపలికెళ్లిన దొంగలు హుండీ తాళాన్ని తొలగించి కానుకలను అపహరించి చిల్లర నాణేలను అక్కడే వదిలేసి వెళ్లారు. అలాగే దేవుని ముందు వేసిన విలువైన గంటలను కూడా ఎత్తుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన మద్యం, ఆటోను చూపుతున్న సీఐ

దేవనకొండ: ఈదులదేవరబండ గ్రామ శివారులోని ఎర్రబాడు అడ్డ రోడ్డు వద్ద ఈదులదేవరబండ గ్రామానికి చెందిన చింతకాయల రమేష్ శనివారం ప్యాసింజర్ ఆటో(ఏపీ21 టీసీ 1786)లో కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడని సీఐ గిరిధర్ తెలిపారు. 90 ఎంఎల్ పరిమాణం గల 30 బాక్సుల ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని పత్తికొండ కోర్టులో జడ్జి ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించారన్నారు. మద్యం, ఆటోను సీజ్ చేసినట్లు వివరించారు.

డ్రైనేజీ పనులు పూర్తి

హొళగుంద: ఎల్లార్తి బస్టాండు సమీపంలో వర్షపు నీరు, గ్రామంలోని మురుగు నీరు ముందుకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండటంతో సర్పంచ్ కురువ చాముండేశ్వరి కొత్త డ్రైనేజీ ఏర్పాటు చేయించారు. శనివారం పనులు పూర్తవడంతో ఆమె మాట్లాడుతూ.. త్వరలో ఎల్లార్తి షేక్షావలి, షాషావలి వేడుకలు జరగనుండటంతో అవసరమైన ఏర్పాట్లు, పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామని చెప్పారు.

కంటి వెలుగుకు మంగళం

- ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి పరీక్షలు నిలిపివేత
- కంటి పరీక్ష కేంద్రాన్ని తొలగించిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేల మందికి కంటి పరీక్షలు

ప్రజలకు మంచి చేసే పనులంటే కూటమి ప్రభుత్వానికి గిట్టడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో అమలు చేసిన ఎన్నో కార్యక్రమాలు ప్రజాదరణ పొందాయి. ఆయా కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తోంది. ఇప్పటికే సంక్షేమ పథకాలను తొలగించి ప్రజలను ఇబ్బందులు పెడుతోంది. అలాగే పేదల కళ్లను సంరక్షించేందుకు నాడు జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా కంటి వెలుగుకు ప్రాధాన్యతనిచ్చి ఉచితంగా పరీక్షలు, ఆపరేషన్లు, అద్దాలు అందజేసేవారు. ప్రస్తుతం ఆ విధానాలకు చంద్రబాబు ప్రభుత్వం స్వస్తి పలకడంతో పేదలకు ఇబ్బందులు తప్పడం లేదు.





ఆలూరు సీహెచ్‌సీలో ఎత్తివేసిన కంటి పరీక్షల విభాగం, ఆలూరు సీహెచ్‌సీలో వృద్ధురాలికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న అప్తాల్మిక్ అసిస్టెంట్ (ఫైల్)

ఆలూరు రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేదలకు ఉచితంగా అందించే వైద్యాన్ని సైతం దూరం చేసేందుకు పూనుకుంది. కొన్ని పథకాలు రద్దు చేస్తూ..మరికొన్ని పథకాల పేర్లు మార్పు చేసి వాటి నిర్వహణను నిర్వీర్యం చేస్తోంది. గత ఐదేళ్ల పాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధన్యతనిచ్చిన కంటి వెలుగు కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ఎత్తివేసింది. 2017 డిసెంబర్ నెలలో ప్రతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అపోలో ఫార్మసీ సంస్థ ఆధ్వర్యంలో కంటి పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఒక ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌తో పాటు ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటు చేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేంద్రాల ఏర్పాటు ఒప్పందాన్ని రెన్యూవల్ చేసి పేద ప్రజల కంటి చూపుకు మరింత భరోసానిచ్చింది. ప్రస్తుత నెలతో ఒప్పందం గడువు ముగిసినా కూటమి ప్రభుత్వం ఒప్పందాన్ని కొనసాగించకపోవడంతో అపోలో నిర్వాహకులు కేంద్రాలను ఎత్తివేశారు. దీంతో పేదలు కంటి వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారు.

జగనన్న హయాంలో వేల మందికి కంటి పరీక్షలు..

గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలకు అందించే వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నాడు–నేడు పథకం ద్వారా పీహెచ్‌సీలను ఆధునీకరించారు. ప్రతి మండలానికి 108,104 వాహనాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. 104 వాహనాల ద్వారా ఇంటింటికీ వైద్యం అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వేల మందికి ఇంటి వద్దనే వైద్యం అందించే వెసులుబాటు కల్పించారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు కంటి వెలుగు కార్యక్రమం ద్వారా వారి కంటి వెలుగుకు భరోసా ఇచ్చారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా రోజుకు 70 నుంచి 80 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు పంపిణీ చేసేవారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసి ఆపరేషన్లు చేయించేవారు. ప్రస్తుతం ఆ కేంద్రాన్ని ఎత్తివేయడంతో పేద ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రత్యేక శిబిరాల ద్వారా కంటి పరీక్షలు..

గత ప్రభుత్వ హయాంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కింద ప్రత్యేక నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహించేవారు. వారానికి ఒక సచివాలయంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ప్రతి పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 900 మంది విద్యార్థులకు పైగా అద్దాలు పంపిణీ చేశారు. గత ఏడాది నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా 3 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు అందజేశారు. ఏడాది ఒక సారి ఆలూరు సీహెచ్‌సీలో నిర్వహించిన ప్రత్యేక కంటి వైద్య శిబిరం ద్వారా 500 మందికి పైగా ఆపరేషన్లు చేయించుకున్నారు. ప్రతి నెల 50 మందికిపైగా ఉచితంగా కంటి అద్దాలు పొందేవారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న అప్తాల్మిక్ (ఫైల్)



ఆలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)



జగనన్న సురక్ష పథకం కింద ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

పేదలకు ఇబ్బంది



ఆలూరు ఆసుపత్రిలో కంటి పరీక్షల కేంద్రం ఎత్తివేయడంతో పేద ప్రజలకు ఇబ్బంది. గ్రామీణ ప్రాంత వాసులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఇప్పుడు కంటి సమస్యలు వస్తే ఆదోని,గుంతకల్లు,బళ్లారి పట్టణాలకు వెళ్లి ప్రైవేటు కంటి ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవాలంటే వేల రూపాయలు కావాలి. గతంలో ఆలూరులోనే కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు ఇచ్చేవారు. దీంతో పేదలకు ఆర్థికంగా ఇబ్బంది ఉండేది కాదు.

– మహబూబ్ బాషా,హత్తిబెళగల్

ఉచితంగా పరీక్షలు చేసి అద్దాలు ఇచ్చారు



నాకు రెండేళ్ల నుంచి కంటి చూపు సరిగా ఉండేది కాదు. గత ఏడాది జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా కంటి పరీక్షలు చేయించుకున్నా. ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసి వారంలోగా అద్దాలు ఇచ్చారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు. ఇప్పుడు కంటి చూపు బాగుంది.

– ఆసియా,ఆలూరు

ఒప్పంద గడువు ముగిసింది

అపోలో ఫార్మసీ వారు ఆలూరు సీహెచ్‌సీలో కంటి పరీక్ష కేంద్రం నిర్వహించేవారు. ఈ నెల 6వ తేదీతో ప్రభుత్వంతో ఉన్న ఒప్పంద గడువు ముగిసింది.దీంతో ఆ సంస్థ అందించిన మిషన్లు, కంప్యూటర్ తదితర పరికరాలు తీసుకెళ్లారు. రెండు నెలల్లో కొత్త ఏజెన్సీ ద్వారా టెండర్లు పిలిచి కంటి పరీక్షలు నిర్వహిస్తారని ఉన్నతాధికారులు తెలిపారు. ఆదేశాలు వచ్చిన వెంటనే పరీక్షలు నిర్వహిస్తాం.

– వాహిద్, డాక్టర్, ఆలూరు

ఇది ప్రజలను ముంచే ప్రభుత్వం

- చంద్రబాబు వంద రోజుల పాలనంతా వంచనే
- ప్రజలకు ఏం చెప్పాలో తెలియకే దేవుళ్ల ప్రసాదాలపై అనుచిత వాఖ్యలు
- కంగాటి శ్రీదేవి ధ్వజం



పత్తికొండలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ(తుగ్గలి) : ఇది మంచి ప్రభుత్వం కాదు.. ప్రజలను ముంచిన ప్రభుత్వం. సూపర్ సిక్స్ అంటూ రైతులు, మహిళలు, పిల్లలను మోసం చేశావు.. కుట్రలు, దాడులు..అరాచకాలతో రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చావు.. ఇదేనా నీవంద రోజుల మంచి పాలన అని సీఎం చంద్రబాబుపై మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ధ్వజమెత్తారు. శనివారం పత్తికొండలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబువి అన్నీ అబద్ధాలు, ఆర్భాటాలేనని మండిపడ్డారు. జగన్ హయాంలో నిత్యావసర ధరలు పెరిగాయని, తాము అధికారంలోకి వచ్చాక ధరలు తగ్గిస్తామన్నారని, ధరలు తగ్గించేందుకు వంద రోజులు సరిపోలేదా అని ఎద్దేవా చేశారు. ధరలు తగ్గించకపోగా ఇంకా విపరీతంగా పెరిగాయన్నారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచి..రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని దూరం చేయడమే చంద్రబాబు సర్కార్ వందరోజుల ట్రాక్ రికార్డు అని విమర్శించారు.

సూపర్ సిక్స్‌కు సున్నం పెట్టారు..

ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చేందుకు లేనిపోని హామీలు ఇచ్చి పదవిలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా ప్రజలను వంచించారని, ఇప్పుడు వారికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తల్లికి వందనం ఎక్కడా ? పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారు? ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఏదీ?, ఉచిత బస్సు ప్రయాణం ఏమైంది? యువతకు ఉద్యోగాలు ఎన్ని ఇచ్చారు? ఎంత మంది నిరుద్యోగులకు భృతి ఇచ్చారు? బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇచ్చారా? ప్రతి ఇంటికీ మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 80 శాతానికి పైగా హామీలను అమలు చేశారని గుర్తు చేశారు.

సూపర్ సిక్స్ మరిచిపోవాలనే టీడీపీ కొత్త డ్రామా..

ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలు మర్చి పోవాలనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డిపై సీఎం చంద్రబాబు బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద రోజుల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు శ్రీవారి లడ్డు ప్రసాదాలపై దుష్ప్రచారంతో రాజకీయాలు చేయడం సిగ్గు చేటన్నారు. తన రాజకీయ స్వార్థం కోసం శ్రీవారి లడ్డు ప్రసాదంపై కూడా దుష్ప్రచారం చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతినే విధంగా చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయం కోసం దేన్నీ వదలని చంద్రబాబుకు ఆ శ్రీవారే తగిన బుద్ధిచెబుతాడన్నారు. ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగరాజు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు అట్ల గోపాల్‌రెడ్డి, నాయకులు బాబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, భాస్కరనాయక్, గణపతి పాల్గొన్నారు.

దేవరగట్టును సందర్శించిన సబ్‌కలెక్టర్



దేవరగట్టులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్

హొళగుంద: బన్ని ఉత్సవాల విశిష్టత, ఉత్సవాలు జరిగే విధానం తదితర వాటి గురించి తెలుసుకునేందుకు ఆదోని సబ్ కలెక్టర్ భరద్వజ శనివారం దేవరగట్టులో పర్యటించారు. మల్లప్ప గుడిలోని సింహాసన కట్టను దర్శించుకున్నారు. అనంతరం తేరుబజారు, ఆస్పరి మఠం, చెరువు గట్టు తదితర ప్రాంతాల్లో కలియ తిరిగి ఉత్సవాలు జరిగే విధానం గురించి ఆలయ పూజారులు, ఉత్సవ నిర్వాహకులు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాల పెద్దలను అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్ స్థలం, తాగునీరు, హెల్త్ క్యాంప్, విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాలు, బారికేడ్ల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర చర్యల గురించి తహసీల్దారు ప్రసాద్‌రాజును అడిగి తెలుసుకున్నారు.

వికసిత్ ఆంధ్రపై సమీక్ష..

అనంతరం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేకధికారి నాగేశ్వరరావు, ఎంపీడీఓ సుహాసినమ్మతో కలిసి ఆయా శాఖల అధికారులతో వికసిత్ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హొళగుందలోని ఉన్న తమ పట్టా భూములు రెవెన్యూ రికార్డులో మిగులు భూములుగా చూపిస్తున్నారని వాటని సరి చేయాలని రైతు పంపాపతి ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

రేపటి నుంచి సమ్మెలోకి ఏఎన్‌ఎంలు



మొలగవల్లి పీహెచ్‌సీ ఎంపీఈఓహెచ్‌ఓ అండ్రూస్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏఎన్‌ఎంలు

ఆలూరు రూరల్: సచివాలయ ఉద్యోగులుగా ఉన్న ఏఎన్‌ఎంలను పీహెచ్‌సీ మాతృ శాఖకు బదిలీ చేయాలని మొలగవల్లి పీహెచ్‌సీకి చెందిన 11 మంది ఏఎన్‌ఎంలు సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు మొలగవల్లి పీహెచ్‌సీ ఎంపీఈఓహెచ్ అండ్రూస్‌కు వినతి పత్రం అందించారు. శనివారం వారు మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థలో భాగంగా తాము ఉద్యోగంలో చేరామన్నారు. అయితే ఒక పక్క సచివాలయ పనులు చేయిస్తూ, మరో పక్క పీహెచ్‌సీ బాధ్యతలు నిర్వర్తించడంతో ఒత్తిడికి గురై అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు శాఖల పనులు చేయడం ఇబ్బందిగా ఉందన్నారు. తమ మాతృశాఖ ఆరోగ్య శాఖకు బదిలీ చేసి ఆరోగ్య కార్యకర్తల విధులు అప్పగించాలని కోరారు. ఏఎన్‌ఎంలు యశోదమ్మ, రుక్మిణి,సుజాత ఉన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఉమాదేవి

మద్దికెర : మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై మండల అధికారులతో మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి శనివారం సమీక్ష సమేవేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లయిన సందర్భంగా గ్రామాల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులుపై దృష్టి సారించాలన్నారు. ఇంకా ఏయే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలో ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ప్రజలకు అన్ని రకాలు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎంపీడీఓ స్వర్ణలత, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, పశువైద్యాధికారి కృష్ణానాయక్, ఏఈలు మయాంక్, ఉమాకాంత్ పాల్గొన్నారు.

24న చెరువులో చేపలు పట్టేందుకు వేలం

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని వీరన్నగట్టు చెరువులో చేపలు పెంచుకుని, పట్టుకుని అమ్ముకునేందుకు ఈనెల 24వ తేదీన కర్నూలులోని తన కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి. విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జూన్ ఆఖరు వరకు కాల పరిమితి గల వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.వెయ్యి దరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. వేలం ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజల రక్షణకే కార్డెన్ సెర్చ్



పత్తికొండలో అనుమానితుల ఇంట్లో సోదాలు చేస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

పత్తికొండ(తుగ్గలి) : ప్రజల రక్షణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని, అనుమానం ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగిస్తామని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం వేకువజామునే డీఎస్పీ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పత్తికొండ పట్టణంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు గంజాయి, సారాయి, మద్యం, గుట్కా, పేకాట వంటి వంటి వ్యవసనాల జోలికెళ్లకుండా సన్మార్గంలో నడవాలన్నారు. ప్రజలు ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లబారిన పడి డబ్బులు పోగొట్టుకుంటున్నారని, గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫోన్లకు సమాధానం ఇవ్వొద్దని, ఏటీఎం, బ్యాంకు ఖాతా వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పొద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలు, 20లీటర్ల నాటుసారాయి, 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని విక్రయదారులను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో సీఐలు జయన్న, పులిశేఖర్, శ్రీనివాసనాయక్, మస్తాన్ వలి, మధుసూదనరావు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటలతో అధిక లాభాలు

ఆలూరు: సన్న,చిన్నకారు రైతులు అధిక లాభాలను పొందేందుకు పండ్ల తోటల ద్వారా సాధ్యమవుతుందని ఆలూరు హార్టికల్చర్ అధికారిణి ఇందిర రైతులకు సూచించారు. శనివారం హాలహర్వి మండలం సిద్ధాపురం, అమృతాపురం, చిప్పగిరి మండలం నంచర్ల గ్రామాల్లో రైతులు శ్రీధర్‌రెడ్డి, బసప్ప, ఈరన్న తదితరులు చీని, బత్తాయి, జామపండ్ల తోటలను పరిశీలించారు. బోరు బావులు ఉన్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా డ్రిప్‌ను మంజూరు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 250 మంది వరకు సన్న, చిన్న కారు రైతులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఈ ఏడాదిలో మరో 500 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేయించాలని నిర్ణయించామన్నారు. ఆలూరు, పెద్ద హోతూరు,కప్పట్రాళ్ల, అలారుదిన్నె గ్రామాల రైతులు అధికంగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారని వివరించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

హాలహర్వి: మెదేహాల్ గ్రామానికి చెందిన శ్రీ రామగిరి మఠం మోక్షేశ్వరస్వామి (59) రెండు రోజుల క్రితం మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. గాయపడిన మోక్షేశ్వరస్వామిని బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ చంద్ర తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం

పత్తికొండ(తుగ్గలి) : రక్తదానంతో ప్రాణదానం చేసినట్లేనని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శనివారం నిర్వహించి రక్తదాన శిబిరంలో 22 మంది రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ మాధురి, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ కల్పన, ఆదోని ఆర్‌ఎంవో జగదీష్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మ నారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆస్పరిలో పరిసరాల పరిశుభ్రత

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయతీ ఆస్పరిలో శనివారం × స్వచ్ఛతా హీసేవా౯ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో పంచాయతీ కార్మికులు పరిశుభ్రత పనులు చేపట్టారు. మంచి నీటి ట్యాంకుల దగ్గర ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు జేసీబీతో తొలగించినట్లు కార్యదర్శి జంప్లానాయక్ తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ కాలువల్లో చెత్తా, చెదారం, మంచి నీటి ట్యాంకుల శుభ్రం చేయడం తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు.

ఘనంగా తిక్కతాత ఆరాధన



ప్రత్యేక అలంకరణలో తిక్క నరసింహయ్య తాత సమాధి

వెల్దుర్తి: పట్టణ సమీపంలో హైవే – 44 ప్రక్కన వజ్రాల సుంకులమ్మ గుడి పక్కనున్న ఆలయ సమూహంలో తిక్క నరసింహయ్య తాత 41వ ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి ఆరాధన జరిగింది. నిర్వాహకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయం నుంచి అభిషేకాలు, నైవేద్యం, మంగళహారతులు తదితర పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని, ఆయన శిష్యుడు ఆంజనేయులును దర్శించుకుని పూజలు చేశారు. ప్రక్కనే కొలువైన సీతారామ లక్ష్మణులను, ఈశ్వరుడు, వజ్రాల సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. రాత్రి అఖండ భజన, నందికోల సేవలు జరిగాయి. ఎస్‌ఐ అశోక్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బాణ సంచా నిల్వ ఉంచుకోరాదు

ఆలూరు రూరల్: వ్యాపారులు తమ దుకాణాల్లో,ఇళ్లలో బాణా సంచా నిల్వ ఉంచుకోరాదని ఎస్‌ఐ నరసింహులు సూచించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని టపాసుల విక్రయదారులు శాంతన్న గౌడ్,శివన్న గౌడ్‌కు ఇళ్లలో సోదాలు నిర్వహించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే మేయిన్ బజారులోని కిరాణా షాపుల్లో తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ..నిబంధనలకు విరుద్ధంగా బాణా సంచా నిల్వ ఉంచితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం బాణాసంచా నిల్వ చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు.